# ప్రజా మైత్రి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 07  సంచిక : 24  శనివారం  19 - 09 - 2026  పేజీలు : 04  వెల రూ. 2




భద్రాద్రిలో కరెన్సీ నోట్లతో గణపయ్య.. అలంకరణకు రూ.1.45 కోట్లు!

# 22ఏ భూముల సమస్యలకు చెక్!



- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- 22ఏ భూములతో పాటు పలు భూ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది
- ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్ నేతృత్వంలో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది

హైదరాబాద్ :

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక అడుగేసింది. ఈ మేరకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతులను సభ్యులుగా ఉండనున్నారు. దీంతోపాటు 118 జీవో బాధితులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లో 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ముందుకెళ్తోంది. దీంతో ఇతర భూసంబంధిత సమస్యలనూ వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. - మిగతా 2 లో

మా ఆస్తులు తీసుకుని

## రూ. 1,000 కోట్లు ఇవ్వండి



- రేవంత్ కు కేటీఆర్ సవాల్
- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు

హైదరాబాద్ :

ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ. కాంగ్రెస్ - మిగతా 2 లో



## అబద్ధాలు ప్రచారం చేయొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు

- చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని
- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ

హైదరాబాద్ :

సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో - మిగతా 2 లో

జమ్మూకశ్మీర్‌లో


## ఉగ్ర ముఠా గుట్టురట్టు




- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించిన ముగ్గురు నిందితులు అరెస్ట్
- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన నిందితులు
- వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్న అధికారులు

ఢిల్లీ :

జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ ఉగ్రవాద ముఠా గుట్టురట్టు చేశారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక పిస్టల్, మ్యాగజైన్, మందుగుండు సామగ్రితో పాటు రెండు చైనీస్ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఉగ్రవాదులకు సహకరిస్తున్న ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం చేశారు.తమ దర్యాప్తులో, జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి, కోట్ చార్వార్ ప్రాంతాలకు చెందిన - మిగతా 2 లో



## ధర్మం వృద్ధాప్యానికి పరిమితం కాదు

- జెన్-జీ ఆధ్యాత్మికత వైపు చూస్తోంది - మోహన్ భగవత్
- ధర్మం పుట్టుక నుంచి మరణం వరకు ఉంటుందన్న భగవత్
- వృద్ధాప్యంలోనే ధర్మం గురించి ఆలోచించడం సరికాదని వ్యాఖ్య
- అహంకారంతో అన్నీ నడిపిస్తున్నామనుకోవడం భ్రమేనని వ్యాఖ్య
- సుఖానికి మూలం ధర్మమేనని స్పష్టం చేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్

ఢిల్లీ :

ధర్మం అనేది కేవలం వృద్ధాప్యానికి పరిమితమైన అంశం కాదని, మనిషి పుట్టినప్పటి నుంచి చివరి వరకు అది మార్గనిర్దేశం - మిగతా 2 లో

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసిన హైకోర్టు



- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం
- ఏలేటి, కౌశిక్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా అయినట్లు స్పష్టీకరణ
- ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసిందిం
- అనర్హత వేటుపై హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నట్టు తెలిపిన దానం
- సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం లేదని స్పష్టీకరణ

హైదరాబాద్ :

దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో దానంపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడని స్పష్టం చేసింది.ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. స్పీకర్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి అనర్హతా - మిగతా 2 లో

టీజీఎస్ఆర్టీసీలో

## ఎన్నికల నగారా

- అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు
- విడుదలైన ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్
- 2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు
- కార్మికుల వేతనాలపై చర్చించే అధికారం గుర్తింపు సంఘానికే

2 లో

పాకిస్థాన్‌లో మసీదుపై

## ఆత్మాహుతి దాడి

- పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి
- ఈ ఘటనలో ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి
- 50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం



ఢిల్లీ :

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహాట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని - మిగతా 2 లో



అంబటి రాంబాబుకు

## మరో షాక్

- విచారణకు రావాలంటూ ఈడీ నోటీసులు
- అంబటికి ఈ నెల 11వ తేదీన ఈడీ నోటీసులు
- విచారణకు హాజరు కావాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్న వైనం
- అయితే ఆ నోటీసులు తనకు అందలేదన్న అంబటి
- దాంతో, నేడు ఫోన్ ద్వారా సమాచారం అందించిన అధికారులు
- ఇప్పటికే అంబటిపై పలు కేసులు నమోదు

అమరావతి :

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ ఈ నెల 11వ తేదీనే నోటీసులు పంపినట్టు ఈడీ అధికారులు ఆయనకు నేడు ఫోన్ ద్వారా సమాచారం - మిగతా 2 లో

ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు,

## ఏఐ స్కిల్స్ తప్పనిసరి



- నారా లోకేశ్ ఆదేశాలు
- నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం
- 10 రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి
- సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం

అమరావతి :

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ - మిగతా 2 లో

# ఒకేసారి 28 ప్రాజెక్టులు 20,000 ఉద్యోగాలు



- పోర్టు ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- రూ.22,177 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 19,739 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు
- ఏపీని హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిన తిరుపతి జిల్లా
- ఆమోదం పొందిన ప్రాజెక్టులను 6 నెలల్లో ప్రారంభించాలని సీఎం ఆదేశం

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.22,177.84 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 19,739 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన, ఐటీ, ఆహార శుద్ధి, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన ఈ ప్రతిపాదనలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు రెండు ప్రధాన లక్ష్యాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా (హబ్) తీర్చిదిద్దడంతో పాటు, తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థను (ఎకో సిస్టమ్) నిర్మించాలని ఆదేశించారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పరిశోధన, డిజైన్, తయారీతో కూడిన పూర్తిస్థాయి ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగాల్లో పెట్టుబడుల కోసం తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు - మిగతా 2 లో

# సంపాదకీయం

## యుద్ధంతో శాంతి అసాధ్యం!



“కేశవా! నాకు అపశకునములు కనిపిస్తున్నాయి. యుద్ధంలో స్వజన సమూహాన్ని సంహరించడం వల్ల శ్రేయస్సు కలుగుతుందని నాకు అనిపించడం లేదు. విజయం, రాజ్యం, సుఖాలు నాకు అవసరం లేదు. ఈ భోగాలు, ఈ జీవితం వల్ల ప్రయోజనం ఏమిటి?”అని వేల ఏళ్ల క్రితం అర్జునుని హృదయంలో కలిగిన ఆవేదన, కరుణ, మానవత్వ భావనలు నేటికీ వర్తిస్తాయి. యుద్ధం వల్ల కలిగే వినాశనాన్ని అతడు ముందుగానే ఊహించాడు. ఇరుపక్షాల వారినీ స్వజనులుగానే భావించాడు. మరి నేడు?చరిత్రను పరిశీలిస్తే, యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుశక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు.లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనా--ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది.కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుత ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి.అణ్వాయుధాలు, జీవాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు.మానవాళిలో దయ, ప్రేమ, సహనభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, “వసుధైవ కుటుంబకం” భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించగలదని ఆశిద్దాం.

## జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ముఠా గుట్టురట్టు

**మొదటిపేజీ తరువాయి -** ముగ్గురు వ్యక్తులు లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. వీరు ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడమే కాకుండా, రాజౌరీ-రేసి, పిర్ పంజాల్ ప్రాంతాల గుండా షోపియాన్ వరకు వారు వెళ్లడానికి సహాయపడ్డారని చెప్పారు. అంతేకాదు నిషేధిత ఎల్‌ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్స్ మాడ్యూల్‌లో ఈ ముగ్గురు అనుమానితులు భాగంగా ఉన్నారని పేర్కొన్నారు. వీరిపై రాజౌరీలోని ధర్మసాల్ పోలీసు స్టేషన్‌లో కేసు (ఎఫ్ఐఆర్ నెం.95/2026) నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రస్తుతం తాము సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.“ఉగ్రవాదుల మాడ్యూల్‌పై జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు తెలిపాయి. కోట్ చార్వాల్‌కు చెందిన మహ్మద్ అజమ్, జాకీర్ హుస్సేన్, మహ్మద్ ముస్తాఖ్ అనే ముగ్గురు వ్యక్తులు నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్ సపోర్ట్ మాడ్యూల్‌లో భాగమని తేలింది. 2023లో రియాసిలోని చస్సానాలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే అంతకుముందు ఆ ఉగ్రవాదులకు ఈ ముగ్గురు నిందితులు సాయం చేయడం, ఆశ్రయం కల్పించడం, వారి కోరుకున్న చోటుకు వెళ్లేందుకు సహకరం అందించారు” అని పోలీసులు తమ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు



ఉగ్రవాదులు హతమయ్యారు. ఉధంపూర్ జిల్లాలోని మజల్తా ప్రాంతంలోని బ్రెట్టల్ సోహన్, ఖుబ్బన్ అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే వారికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జీవవీ)తో సంబంధాలున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సెప్టెంబర్ 16 (బుధవారం)న బ్రాటెల్ సోన్, ఖుబ్బన్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారని పక్కా సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. సుమారు రాత్రి 9 గంటల సమయంలో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. నిర్దిష్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. ఆపరేషన్ మొదలైన కాసేపటికే ఉగ్రవాదుల స్థావరం లక్ష్యంగా భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. పేలుళ్ల శబ్దాలు కూడా అటవీప్రాంతంలో వినిపించాయి. అయితే గురువారం ఉదయం భద్రతా వలయాన్ని తప్పించుకునేందుకు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరంగా కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. అదనపు బలగాలతో అటవీ ప్రాంతాన్ని నలువైపులా దిగ్బంధించినట్లు తెలిపారు.అదనపు బలగాలను ఘటనాస్థలికి తరలించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇద్దరు ఉగ్రవాదులు హతమైనప్పటికీ, ప్రాంతంలో మరెవరైనా దాక్కున్నారా అనే కోణంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఆపరేషన్ పూర్తిగా ముగియలేదని సైన్యం స్పష్టం చేసింది. మిగిలిన ముప్పును గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి ఉన్నాయని వైట్ నైట్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు జులై 8న ఓ ఎల్‌ఈటీ ఉగ్రవాదిని ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. షోపియాన్‌లోని సైద్‌పొరా ప్రాంతంలోని దట్టమైన పండ్ల తోటలో ఇద్దరు ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు నిఘా కెమెరాల్లో రికార్డైంది. లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్ సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జులై 3న షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్(ఆర్ఆర్), సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించి ఆ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి.

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి

**మొదటిపేజీ తరువాయి -** ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు.పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలాగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. గాయపడిన వారిలో అధికశాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు.పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు.

## ధర్మం వృద్ధాప్యానికి పరిమితం కాదు

**మొదటిపేజీ తరువాయి -** చేస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించిన ‘యువ ధర్మ సంసద్’ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.ప్రస్తుత కాలంలో యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొంటుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భగవద్గీత, రామాయణం వంటి పవిత్ర గ్రంథాలను కేవలం పదవీ విరమణ తర్వాత చదవాలని చాలామంది భావిస్తారని, అయితే ఆ అభిప్రాయం ఏమాత్రం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. జీవితంలోని ప్రతి అడుగు ధర్మానుసారమే సాగాలని సూచించారు.నేటి తరం యువత (జెన్-జీ) ధర్మం, ఆధ్యాత్మిక అంశాలు, భజనల పట్ల ఆసక్తి కనబరచడం సంతోషకరమని భగవత్ అన్నారు. “అన్నీ నేనే చేస్తున్నాను” అనే అహంకారం కేవలం భ్రమకే దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ధర్మాన్ని నిష్పక్షపాతంగా అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనసులో ఉన్న పాత అపోహలను, ముందస్తు అభిప్రాయాలను పక్కన పెట్టాలని కోరారు.తన ఆలోచనలను ఇతరులపై రుద్దడం తన ఉద్దేశం కాదని, ఈ జ్ఞానం సృష్టి ఆరంభం నుంచే ఉందని ఆయన వివరించారు. సృష్టి ఆది నుంచి అంతం వరకు ధర్మమే శాశ్వతమని, వ్యక్తిగత జీవితంలో పుట్టుక నుంచి మరణం వరకు సర్వ సుఖాలకు ధర్మమే మూలమని మోహన్ భగవత్ పునరుద్ఘాటించారు.

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసిన హైకోర్టు

**మొదటిపేజీ తరువాయి -** వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటీషన్లపై హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరి పిటీషన్లపై హైకోర్టులో ఆగష్టు 21వ తేదీన వాదనలు ముగిశాయి. సెప్టెంబర్ 16వ తేదీన ఉత్తర్వులు వెలువరించాల్సి ఉన్నప్పటికీ తీర్పు కాపీలు సిద్ధం కాకపోవడంతో సీజే ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు సుదీర్ఘ విచారణ నిర్వహించింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ టికెట్ పై లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానంపై అనర్హతా వేటు వేయాలని వాదించారు.స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోకపోతే నేరుగా జోక్యం చేసుకొని ఎమ్మెల్యేపై వేటు వేసే అధికారం హైకోర్టుకు ఉందని వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొందని వాదించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్?కు రాజీనామా చేయకపోయినా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడంతోనే సహజంగా సభ్యత్వం పోయినట్లేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసి పార్టీ మారినప్పటి నుంచి ఆయనకు శాసనసభ నుంచి అందిన జీతభత్యాలను తిరిగి చెల్లించేలా ఆదేశించాలని వాదించారు.దానంపై స్పీకర్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మార్చి 11వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాని కోరారు. దానం ఇప్పటికీ బీఆర్ఎస్?లోనే ఉన్నారని శాసనసభలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఆయన



తరఫు న్యాయవాది వాదించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని దానం కలిశారని వాదించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలను చూసి.. అపోహతోనే పిటీషన్లు దాఖలు చేశారని దానం తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసి ఉత్తర్వులు వెలువరించింది. దానంపై అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని ఆయన వివరించారు. ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే పోరాడతామన్నారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని దానం వివరించారు. పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చినవాడినని తెలిపారు.దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కౌశిక్‌రెడ్డి తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

### సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం లేదని స్పష్టీకరణ

తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, మీడియా సమావేశంలో తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, “ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను” అని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు.గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.

## ఒకేసారి 28 ప్రాజెక్టులు.. 20,000 ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి -** మంత్రి నారా లోకేశ్ తెలిపారు.రాష్ట్రంలోని యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 10వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల వల్ల తిరుపతి జిల్లా ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో, తూర్పుగోదావరి 12వ స్థానంలో నిలిచాయని, వీటిని టాప్-5కి తీసుకురావడమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ‘వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్’ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వీటితో పాటు రేర్ ఎర్త్ మినరల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఆమోదం పొందిన ప్రాజెక్టులను కేవలం ఆరు నెలల వ్యవధిలో ప్రారంభించేలా పర్యవేక్షించాలని అధికారులకు గడువు విధించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి. నారాయణ, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబుకు మరో షాక్

**మొదటిపేజీ తరువాయి -** అందించారు. అయితే తనకు నోటీసులు అందలేదని ఈడీ అధికారులకు అంబటి తెలిపారు. దీంతో, విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ ఆయనకు అధికారులు స్పష్టం చేశారు. పలు వివాదాస్పద అంశాలు, చట్టపరమైన కేసుల్లో వార్తల్లో నిలిచిన ఆయనకు, ఈడీ నేరుగా సమన్లు జారీ చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.గతంలోనే అంబటి రాంబాబుపై పలు పోలీస్ కేసులు నమోదు కావడంతో పాటు, ఆయన సుమారు 18 రోజుల పాటు రిమాండ్‌లో కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగంపై తిరుపతి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి విచారణకు రావాలని ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి తోడు ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాల్లో ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడం గమనార్హం.మరోవైపు, అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు రావడంపై వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి తమ నేతలపై కుట్రపూరితంగా కేసులు బనాయిస్తోందని ఆరోపిస్తున్నారు.

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని

**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. “ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు” అని ఆయన వ్యాఖ్యానించారు.తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.


## 22ఏ భూముల సమస్యలకు చెక్!

**మొదటిపేజీ తరువాయి -** దీని ప్రకారం ఎల్బీనగర్‌లో జీవో నంబర్ 118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. “ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణను 30 రోజుల్లో పరిష్కరించే దిశగా ముందుకెళ్తున్నాం. ఇందులో భాగంగా ఇవాళ మెమో జారీ చేశాం. 22ఏ కారణంగా ఎవరైతో ఇబ్బంది పడుతున్నారో, ఏ జీవో వల్ల రెగ్యులరైజేషన్ ఇతరత్రా పెండింగ్‌లో ఉన్నాయో వాటిని పరిష్కరిస్తున్నాం. 22ఏలో భాగంగా కొన్ని పనులు ఇప్పటికే కార్యరూపం దాల్చాయి. అందులో జీవో నంబర్ 118 కింద ఎల్బీనగర్లో 9,792 మంది ప్లాట్లు రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అక్కడి భూములకు సంబంధించి ఆ భూ యజమానులకు రేపటి నుంచే పట్టాల పంపిణీ చేయనున్నాం. రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రిసింగరేణి కాలనీ పరిధి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు అక్కడ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ మేరకు తగిన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో ఇవాళ చర్చలు జరిపి, రేపే జీవోను విడుదల చేస్తామని ప్రకటించారు.అదే సమయంలో సెక్షన్ 22ఏ కారణంగా హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ లేదా డీటీసీపీ వంటి సంబంధిత అధికారుల ద్వారా ఆమోదం పొందినప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన లేఅవుట్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా ఈ లేఅవుట్లు రెగ్యులరైజేషన్ ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శాసనసభ వేదికగా వెల్లడించారు.

## టీజీఎస్‌ఆర్టీసీలో ఎన్నికల నగారా


**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు.ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది.ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి.రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

## మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి



**మొదటిపేజీ తరువాయి -** ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. “మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి” అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు



**మొదటిపేజీ తరువాయి -** ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, “ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి” అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది.సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపారు.అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు.ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

శనివారం 19 - 09 - 2026

# తాటిపల్లి శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలన



**జగిత్యాల ( ప్రజా మంటలు ) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి సంబంధించి జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి శివారులో 25 ఎకరాల స్థలాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శుక్రవారం ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎండీ గణపతి రెడ్డి, చీఫ్ ఇంజనీర్ లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తదితరులతో కలిసి నిర్మాణ స్థలం, మ్యాప్‌ను పరిశీలించారు. పాఠశాల బ్లాక్, వసతి గృహాలు, క్రీడా మైదానం తదితర నిర్మాణాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎండీ గణపతి రెడ్డి సూచనలకు అనుగుణంగా జీం3 విధానంలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 2,500 మంది విద్యార్థులు, 300 మంది సిబ్బందికి ఆధునిక విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి పనులకు ఎవరూ అడ్డంకులు సృష్టించవద్దని, పనులపై అనవసర విమర్శలు చేయడం సరికాదని సూచించారు. తాటిపల్లి పరిసర ప్రాంతంలో ప్రస్తుతం సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు.కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ల రాజేందర్, నోముల శేఖర్ రెడ్డి, తహసీల్దార్ హాకీం, ఏఈ శశి, జగిత్యాల అసెంబ్లీ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కర్నె భూమారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముఖీద్, అబ్బూరి మల్లేశం గౌడ్, నలువల సురేష్, ఏఎంసీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి, సదానందం, స్వామిరెడ్డి, తంగెళ్ల రమేష్, ఏనుగు మల్లారెడ్డి, శేఖర్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

## పదో తరగతి విద్యార్థినులకు విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం





**గొల్లపెల్లి, సెప్టెంబర్ 18 ( ప్రజా మంటలు ) :** గొల్లపెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచితో పాటు విద్యార్థినులకు అందుతున్న ఆహారంపై వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రతి విద్యార్థిని తన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, పరీక్షల కోసం అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ పరిశీలనలో తహసీల్దార్, మమ్మద్ అబ్దుల్ మాజిద్,స్పెషల్ ఆఫీసర్ పద్మ, భానుప్రియ, ప్రవంతి,అనూష, జమన, జ్యోతి రాణి మహేశ్వరి,ఉన్నారు

# గాంధీ వైద్యుల అద్భుత ఘనత

## అరుదైన గుండె జబ్బుతో బాధపడుతున్న గర్భిణికి సుఖ ప్రసవం



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 18 ( ప్రజామంటలు) :** అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఓ గర్భిణికి గాంధీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి పునర్జన్మ ప్రసాదించారు. వివరాల్లోకి వెళితే... 22 ఏళ్ల హీనా బేగం అనే మొదటిసారి గర్భం దాల్చిన మహిళ తీవ్రమైన 'ఐసన్‌మెంగర్‌సింద్రోమ్' అనే అరుదైన గుండె జబ్బుతో పాటు పెరిమెంబ్రానస్‌వీఎస్‌డీ (1.9 సెం.మీ), తీవ్ర రక్తపోటు (పీఏహెచ్), తీవ్రమైన టీఆర్, ఎంఆర్ సమస్యలతో బాధపడుతున్నారు. సాధారణంగా గర్భిణుల్లో లక్ష మందిలో కేవలం ఇద్దరిలో మాత్రమే కనిపించే అత్యంత సంక్లిష్టమైన ఈ వ్యాధిని గర్భం దాల్చిన 12వ వారంలోనే గాంధీ ఆసుపత్రి వైద్యులు గుర్తించి అప్పటి నుంచే ప్రత్యేక చికిత్స అందించారు.ఆమె యూనిట్‌విభాగం ఆధ్వర్యంలో నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటూ వచ్చారు. కాన్పు గడువు సమీపించడంతో ఆసుపత్రిలో చేరిన ఆమెకు గైనకాలజీ ప్రొఫెసర్‌డాక్టర్‌జానకి, ఆమె బృందం కార్డియాక ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ నెల 3న ఉదయం 11:19 గంటలకు ఆమె 2.3 కిలోల బరువుతో ఆరోగ్యకరమైన మగ బిడ్డకు జన్మనిచ్చారు. శస్త్రచికిత్స అనంతరం తల్లీబిడ్డలకు ఐసీయూలో ప్రత్యేక వైద్య సంరక్షణ అందించడంతో పాటు క్రమం తప్పకుండా గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ సంపూర్ణ ఆరోగ్యంగా, నిలకడగా ఉండటంతో శస్త్రచికిత్స జరిగిన 15 రోజుల అనంతరం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇంతటి క్లిష్టమైన కేసును విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్‌జానకి, ఆమె వైద్య బృందాన్ని డీఎంఈ డాక్టర్ వాణి, గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తోట ఉషారాణి అభినందించారు.

# బీఆర్ఎస్‌నేతలు కబ్జా చేసిన భూములు పేద దళితులకు

## కాంగ్రెస్ నేతలు దీపక్‌జాన్, గౌరీ సతీష్



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 18 ( ప్రజామంటలు) :** తెలంగాణ ఏర్పడిన పదేళ్ల కాలంలో కేసీఆర్‌కుటుంబం ధరణి ముసుగులో వేల కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్‌భూములను ఆక్రమించిందని సికింద్రాబాద్‌డీసీసీ అధ్యక్షుడు దీపక్‌జాన్, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌ధ్వజమెత్తారు. సికింద్రాబాద్‌జిల్లా కాంగ్రెస్‌కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ భూకబ్జాలపై సమగ్ర విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు.కేసీఆర్‌కుటుంబం చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులతో పూర్తిస్థాయిలో సర్వే చేయించి, వాటిని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అలా స్వాధీనం చేసుకున్న భూములను పేద దళిత వర్గాలకు పంపిణీ చేయాలని వారు కోరారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఎలాంటి భూమి లేదని పేర్కొన్న కేసీఆర్, ఇంత స్వల్ప వ్యవధిలోనే ఆయన కుటుంబం వందలాది ఎకరాలకు యజమానులుగా ఎలా మారిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ప్రభుత్వ భూములను తమ పేర్లపైకి మార్చుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌పాలనలో ధరణి పోర్టల్‌నుంచి 'అనుభవదారులు' అనే కాలమ్‌ను తొలగించి ఎస్సీ, ఎస్టీలను వారి భూములకు దూరం చేశారని మండిపడ్డారు. లక్షలాది మంది ప్రజల భూములు, ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఒకప్పుడు అంబాసిడర్‌కారులో తిరిగిన కల్వకుంట్ల కుటుంబానికి ఇన్ని వేల కోట్ల ఆస్తులు, భూములు ఎక్కడి నుంచి వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్‌విసిరారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్‌కుటుంబం తరతరాలకు సరిపడా ఆస్తులను కూడబెట్టుకుందని, దీనిపై చట్టపరమైన చర్యలు తప్పవని దీపక్ జాన్, గౌరీ సతీష్ లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధులు, పార్టీ ఆఫీస్‌బేరర్లు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ





**రాయికల్, సెప్టెంబర్ 18 (ప్రజా మంటలు) :** రాయికల్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీరనాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆవిష్కరించారు.ఈ విగ్రహాన్ని వేముల ప్రభాకర్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.జనగణనతో పాటు కులగణన చేపట్టిన రెండో రాష్ట్రం తెలంగాణ అని పేర్కొంటూ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారంతో కుల సంఘాల బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గీతా కార్మికుల రక్షణ కోసం కాటమయ్య రక్షణ కిట్లు ఉపయోగకరంగా ఉన్నాయని, అర్హులైన గీతా కార్మికులు పెన్షన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వన మహోత్సవంలో భాగంగా ఈత, తాటి మొక్కలు నాటినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రెండు ఎకరాల వరకు రైతులకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయని అన్నారు. పేద, మధ్యతరగతి రైతులు, ప్రజల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, కౌన్సిలర్లు, గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్ పల్లి కోర్టులో ఏర్పాటు చేసిన వినాయక అన్న ప్రసాదం

## ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ ముద్దు





**మెట్టుపల్లి సెప్టెంబర్ 18 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** అన్నదానం మహాదానం అని సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మెట్ పల్లి కోర్టు కాంప్లెక్స్ లో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అంతకుముందు ఆయన ప్రత్యేక వినాయక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదానం అనేది ఒక మహాత్కార్యం అని, అన్ని దానలల్లో అన్నదానం మాత్రమే గొప్ప దానం అని పేర్కొన్నారు.మనం నిత్యం చేసే భోజనంలో ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు వాడకుండా స్టీల్ సామాగ్రీ వాడితేనే ఆరోగ్యాకరం అని మెట్ పల్లి పట్టణం 16వ వార్డు బిజెపి నాయకులు అరిసె మురళి పేర్కొన్నారు. మెట్ పల్లి కోర్టులో ఏర్పాటు చేసిన వినాయక అన్న ప్రసాదం కార్యక్రమం లో భోజనం చేయడానికి ఆయన న్యాయవాదులకు స్టీల్ సామాగ్రీ పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిస్పో ప్లేట్స్ మరియు గ్లాసులు వాడటం వలన అనారోగ్యం తో పాటూ, పర్యావరనానికి కూడా హాని కలుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తన వంతు కర్తవ్యంతో స్టీల్ సామాగ్రి వాడకాన్ని ప్రోత్సాహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం లోబార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, న్యాయవాదులు కంతి మోహన్ రెడ్డి, వడ్డేపల్లి శ్రీనివాసన్, జిల్లా వెంకటేశ్వర్లు, గంగ్ర ప్రవీణ్ రావు, పుప్పాల రాంభూపాల్, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మా రెడ్డి,ఒజ్జెల శ్రీనివాస్, తునికి వేణు గోపాల్, పసునూరి శ్రీనివాస్, మ్యాడపు గోపి. పోలకొండ దయాకర్ వర్మ, బోడ లక్ష్మణ్, పుప్పాల భానుమూర్తి, తోగిటి రాజశేఖర్, ఓగులపు శేఖర్, పుప్పాల లింబాద్రి, ఎలాముల రాంబాబు, పసునూరి సుదర్శన్, తెడ్డు ఆనంద్, తేలు ప్రతాప్, మెడి చెల్మల సుమలత, మామిడిపల్లి విజయలక్ష్మి, కాజీపేట ప్రవంతి, వెల్మల స్వప్న రాణి, రజిత, బిగుల్లా శంకర్, వాల్గొట్ మహేష్, వెంకటేష్, యుగంధర్, రాజశేఖర్, సత్యనారాయణ, అశోక్, సంజయ్, కోర్టు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్తంభంపల్లి లో హెల్త్ క్యాంపు ఏర్పాటు







**వెల్గటూర్ సెప్టెంబర్ 18 ( ప్రజా మంటలు ) :** స్తంభంపల్లి గ్రామపంచాయతీ వద్ద శుక్రవారం రోజున హెల్త్ క్యాంప్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్లు ఏఎన్ఎం అనురాధ,మీనా సౌమ్య ఆశా వర్కర్ గీత గ్రామ సర్పంచ్ రాజయ్య,ఉప సర్పంచ్ గంగరాజం గార్ల ఆధ్వర్యంలో గ్రామంలోని జ్వరం బారిన పడిన ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగినది.. 3 అంగన్వాడి సెంటర్ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వద్ద పోషకాహార 9వ పోషణ మాసం పైన గర్భవతులు, బాలింతలకు తీసుకోవలసిన జాగ్రత్తలు అంశములపై మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు,వార్డు సభ్యులు,పంచాయితీ కార్యదర్శి కుమార్, కారోబార్ నరేష్, అంగన్వాడీ టీచర్లు పరమేశ్వరి, ప్రమీల, జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు..

## పద్మశాలి సేవా సంఘంలో వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



**గొల్లపల్లి సెప్టెంబర్ 18 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం భవనంలో సామూహిక కుంకుమ పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గణనాథుని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పద్మశాలి భవనంలో ఆధ్యాత్మిక శోభతో, మంత్రోచ్ఛారణలతో మార్మోగింది. మహిళలంతా ఒకే చోట చేరి, భక్తిభావంతో సామూహిక కుంకుమార్చనలు (కుంకుమ పూజలు) చేశారు.?ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, అంకం భూమయ్య, ప్రధాన కార్యదర్శి చౌటపల్లి తిరుపతి , కమిటీ సభ్యులు, మహిళా పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు

# వాహనాల తనిఖీ ముమ్మరం

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల హెచ్చరిక



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 18 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎల్కతుర్తి సీఐ శ్రీను ఎస్సై నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు, ఆర్సీ తదితర వాహన పత్రాలు లేని వారు, సీట్‌బెల్ట్ ధరించకుండా ప్రయాణిస్తున్న కార్ల డ్రైవర్లను గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.రాత్రి వేళల్లో ఒక ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించకూడదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వాహనదారులు తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకూడదని పోలీసులు హెచ్చరించారు.రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సీఐ శ్రీను ఎస్సై నరసింహారావు సూచించారు..

## జైనగర్ కాలనీలో ఘనంగా చిన్నారుల చిత్రలేఖన పోటీలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 18 (ప్రజా మంటలు) :** శ్రీ గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని జైనగర్ కాలనీలోని గణేష్ మండపం వద్ద చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. రాజన బాల భారత్, లయన్స్ క్లబ్ వనితా భారత్, మరియు శ్రీ దీప్తి కౌన్సెలింగ్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో కాలనీకి చెందిన పలువురు చిన్నారులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను, సృజనాత్మకతను చాటారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ వనితా భారత్ అధ్యక్షురాలు డాక్టర్ పి. జ్యోతి రాజా విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాల్యంలోనే పిల్లలలోని అంతర్గత ప్రతిభను గుర్తించి వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ స్వరూపా రాణి, జి. కృష్ణవేణి, లత, దీప, కవిత తదితరులు చిత్రాలు గీసిన చిన్నారులను అభినందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి చిన్నారికి నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నిర్వాహక బృందం కృషిని స్థానికులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా కొనియాడారు.

## సూరారంలో భక్తి పాటలతో అలరించిన మహిళల కోలాటం



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 18 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి భక్తి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సూరారం గ్రామంలోని విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మంటపంలో గొల్లవాడ రాజా రాజేశ్వర కొలాట భజన బృందం, కందుగులవారి ఆధ్వర్యంలో మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది మహిళలు పాల్గొని సంప్రదాయ కోలాటాలతో పాటు విఘ్నేశ్వరుడికి సంబంధించిన భక్తి పాటలను ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో మహిళలు కోలాటాలు వేస్తూ, భజనలు చేస్తూ వినాయకుడిని కొలిచారు. దీంతో మంటపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.విఘ్నేశ్వర మంటపం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. మహిళా భక్తులు, భజన బృందం సభ్యులకు విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులు సహకరించారు.కోలాట భజన బృందం నిర్వహించిన భక్తి కార్యక్రమానికి సహకరించినందుకు విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులకు రాజరాజేశ్వర కొలాట భజన బృందం కందుగులవారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో సంప్రదాయ కళలు, భక్తి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న యూత్ అసోసియేషన్‌ను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర స్వామి యూత్ అసోసియేషన్ సభ్యులు సల్వాల కిరణ్, చెలుపూరి రాజు, బొమ్మనవేన వినాయక్, లెంకలపల్లి సురేశ్, సల్వాల సుధాకర్, పెండ్యాల సుధాకర్, బొమ్మనవేన సుధాకర్, గోపు రమేష్, బొమ్మనవేన సాత్విక్, సల్వాల రాకేశ్, గణబోయిన ధనుష్, ఆరిష్, పంజాల సంపత్, కందుగుల రాజయ్య, గోపు అశోక్, పొడల శ్రీను, సింగనవేన అక్షిత్, మట్రిపల్లి శివమణి, బాసవేన వినోద్, బొమ్మనవేన సురేష్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# నిర్ణీత తేదీలో 'దీపం' రాయితీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ

'దీపం-2' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించే సిలిండర్ల సబ్సిడీపై ప్రభుత్వం స్పష్టత నివ్వనుంది. సిలిండర్ కొనుగోలు చేసిన తర్వాతి నెలలో ఒక నిర్దిష్ట తేదీన సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు.'దీపం-2' పథకం కింద ఏటా మూడు ఉచిత సిలిండర్లను అందిస్తున్నప్పటికీ, లబ్ధిదారుల ఖాతాల్లోకి సబ్సిడీ మొత్తం ఎప్పుడు జమ అవుతుందనే విషయంలో స్పష్టత లేదు. ఈ పథకం కోసం ఏటా రూ.2,900 కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం దీని ద్వారా ఆశించిన రాజకీయ ప్రయోజనాన్ని పొందలేకపోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సిలిండర్ కొనుగోలు చేసిన తర్వాతి నెలలో ఒక నిర్దిష్ట తేదీన సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. పౌర సరఫరాలు, ఆర్థిక శాఖల అధికారులు ప్రస్తుతం ఈ విషయంపై చర్చిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2024 అక్టోబర్ 31న 'దీపం-2' పథకం ప్రారంభించారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు ఏడాదికి మూడు సిలిండర్లు (ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున) అందజేస్తారు. ఈ సిలిండర్ల కేటాయింపు ఏప్రిల్ నుంచి ఈ క్రింది విధంగా లెక్కిస్తారు:



ఏప్రిల్ - జూలై ఆగస్టు - నవంబర్ డిసెంబర్ -- మార్చి

ఈ విధంగా, ఏడాదికి మూడు సిలిండర్లకు సంబంధించిన సబ్సిడీ విడుదల చేస్తారు. ప్రస్తుత విధానం ప్రకారం ప్రభుత్వం ప్రతి విడతకు సంబంధించిన సబ్సిడీ మొత్తాన్ని చమురు విక్రయ సంస్థలకు విడుదల చేస్తోంది. లబ్ధిదారులు సిలిండర్‌ను బుక్ చేసుకుని దాని ధర చెల్లించి, సిలిండర్‌ను పొందుతారు. ఆ తర్వాత సబ్సిడీ మొత్తం వారి ఖాతాల్లో జమ చేస్తారు. అయితే ఆ మొత్తం ఖచ్చితంగా ఎప్పుడు జమ అవుతుందో లబ్ధిదారులకు తరచుగా తెలియదు. కొందరు వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను కలిగి ఉండటం వల్ల, ఏ నిర్దిష్ట ఖాతాలో ఆ నిధులు జమ అయ్యాయో గుర్తించడం కూడా వారికి కష్టమవుతుంది.ఉదాహరణకు కొత్త విధానం ప్రకారం సెప్టెంబరులో వంట గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేసిన అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో అక్టోబరులోని నిర్ణీత తేదీన సబ్సిడీ మొత్తం జమ చేస్తారు. అదేవిధంగా అక్టోబరులో సిలిండర్లు కొనుగోలు చేసిన వారికి నవంబరులో సబ్సిడీ విడుదల చేస్తారు. ఆయా నెలల్లో సబ్సిడీ విడుదలకు సంబంధించిన నిర్దిష్ట తేదీని త్వరలోనే నిర్ణయిస్తారు. 'అన్నదాత సుఖీభవ' 'తల్లికి వందనం'ఇతర నగదు బదిలీ పథకాల మాదిరిగానే 'దీపం-2' సబ్సిడీ విడుదల తేదీ కూడా ముందుగానే తెలుస్తుంది.రాష్ట్రవ్యాప్తంగా 1.61 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 'దీపం-1' పథకం కింద 58.42 లక్షలు గిరిజన ప్రాంతాలకు 0.74 లక్షలు, సీఎస్ఆర్ కింద 6.24 లక్షలు, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద 11.37 లక్షలు, ఇతర విభాగాల కింద 84.42 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచిత సిలిండర్లను అందిస్తోంది . ప్రతి విడతలోనూ సుమారు 92 లక్షల నుంచి ఒక కోటి వరకు సిలిండర్లు రాయితీ ధరపై సరఫరా చేస్తున్నారు.

# ఐటీ సంస్థల ఎదురుగా భారీ 'చెత్త' కొండలు కఠిన చర్యలకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి!

ఐటీ కారిడార్‌లో హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిర్మాణ వ్యర్థాలు ఉండటంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చుట్టుపక్కలున్న మూడు బహుళ అంతస్తుల భవనాల వ్యర్థాలనే అక్కడ పోసినట్లు అధికారుల విచారణలో తేలింది. హైదరాబాద్ లోని నాలెడ్జ్ సిటీలో ఐకియా షోరూం, డెలాయిట్ ఐటీ సంస్థ ఎదురుగా ఉన్న భారీ డంపింగ్ యార్డుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ కారిడార్‌లో హైదరాబాద్ నగర ప్రతిష్ఠను దెబ్బతీసేలా చెత్త, నిర్మాణ వ్యర్థాలను కుప్పగా పోసిన సంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఇటీవల జరిగిన ఓ సమావేశంలో సైబరాబాద్ నగరపాలక సంస్థను (సీఎంసీ) ఆదేశించినట్లు తెలిసింది. ఆ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన కసరత్తు ప్రారంభించారు. చుట్టుపక్కలున్న మూడు బహుళ అంతస్తుల భవనాల వ్యర్థాలనే అక్కడ కుప్పగా పోసినట్లు అధికారులు ప్రాథమిక విచారణ గుర్తించి నివేదించారు. త్వరలోనే ఈ చెత్త, నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్‌కు సంబంధించిన కార్యాచరణ ఉంటుందని సైబరాబాద్ కార్పొరేషన్ స్పష్టం చేస్తోంది.

**వాళ్లతోనే రీసైక్లింగ్ చేయించండి**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న కొన్నాళ్లకు కమిషనర్ సృజన ఐకియా, డెలాయిట్ సంస్థలకు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం డిజిటల్ సర్వే చేయించగా 13 ఎకరాల విస్తీర్ణంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పోగైనట్లు తేల్చారు. ఆయా వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని సీఎంసీ ప్రభుత్వానికి ఇటీవలే లేఖ రాసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆ విషయంపై లోతుగా చర్చలు చేశారు.ఈ క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంస్థల గురించి ఆయన పూర్తి వివరాల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. ఆయా నిర్మాణ సంస్థలతోనే అక్కడున్న వ్యర్థాలను రీసైక్లింగ్ చేయించాలని, ప్రభుత్వ నిధుల్లోంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టొద్దని ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై సీఎంసీ కమిషనర్ సృజనను వివరణ కోరగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సదరు సంస్థలపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**అక్కడే ప్లాంటు ఏర్పాటు చేసి**

చెత్త, నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్‌కు మున్సిపల్ అధికారులు రెండు ప్రతిపాదనలు రూపొందించారు. వ్యర్థాలను శంషాబాద్ లేదంటే జీడిమెట్లలో ఉన్న నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించాలన్నది మొదటి ప్రతిపాదన. చెత్త ఉన్న ప్రాంతంలో రీసైక్లింగ్ చేయడం రెండో ప్రతిపాదన. మొదటి ప్రతిపాదన ఖర్చుతో పాటు ట్రాఫిక్ సమస్య, వాతావరణ కాలుష్యాన్ని పెంచుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ రెండు విధానాలకు దాదాపు రూ.25 కోట్ల నుంచి రూ.45 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. దీని కోసం తుది కార్యాచరణను రూపొందిస్తామని సీఎంసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**భారీ కొండలుగా వ్యర్థాలు**



ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 30 నుంచి 50 అంతస్తుల భారీ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి నుంచి వెలువడుతున్న నిర్మాణ వ్యర్థాలను నిర్మాణదారులు ప్రభుత్వ భూముల్లో గుట్టలుగా పారబోస్తున్నారు. దీంతో హైటెక్ సిటీ నుంచి ఖానామెట్ వెళ్లే దారిలో రెండు భారీ కొండలు ఏర్పడ్డాయి. గచ్చిబౌలిలోని సర్వే నంబరు 44లో 10 ఎకరాలు, కొండాపూర్‌లోని సర్వే నంబరు 59లో 30 ఎకరాలకు సంబంధించిన ప్రభుత్వ భూములున్నాయి. వీటిపై ప్రైవేటు పట్టాదారులు, ప్రభుత్వం మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. దీని ఫలితంగా ఈ భూములపై ఎలాంటి పర్యవేక్షణ లేకుండా పోయింది. దీనిని అవకాశంగా తీసుకుని నిర్మాణదారులు నిర్మాణ వ్యర్థాలను ఇక్కడ భారీ ఎత్తున డంప్ చేశారు. ఇలా రెండు ప్రాంతాల్లో 15 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది.

# పోలీస్ ఉద్యోగాల ప్రిలిమ్స్ డేట్ నవంబర్ 29న ఎస్సై, డిసెంబర్ 20న కానిస్టేబుల్ ఎగ్జామ్స్

పోలీస్ ఉద్యోగాల రాత పరీక్ష తేదీలను తెలంగాణ పోలీస్ నియామక మండలి వెల్లడించింది. ఎస్సై, ఏఎస్సై తత్సమాన పోస్టులకు నవంబరు 29, కానిస్టేబుల్, తత్సమాన ఉద్యోగాలకు డిసెంబరు 20న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ పోలీస్ నియామక మండలి రాత పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. ఎస్సై, ఏఎస్సై పోస్టులకు నవంబర్ 29న, కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న ప్రాథమిక రాత పరీక్షలు జరగనున్నాయి. 7,437 పోస్టులకు ఏకంగా 5,77,064 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాస రావు రాత పరీక్షల తేదీలను ప్రకటించారు.పోలీస్ నియామక మండలి చేపట్టిన ఉద్యోగాల రాత పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. ఎస్సై, ఏఎస్సై తత్సమాన ఉద్యోగాలకు నవంబరు 29న, కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలకు డిసెంబరు 20న ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించనున్నారు. పోలీస్ శాఖలో 5,400, ప్రత్యేక భద్రతా దళంలో 1,424, ఫైర్‌లో 790, జైళ్ల శాఖలో 223 పోస్టులు ఉన్నాయి. మొత్తం కలిపి 7,437 ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలకు జులై 29న నోటిఫికేషన్ విడుదల చేశారు.

**మొత్తం 5,77,64 దరఖాస్తులు**

ఆగస్ట్ 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు దాదాపు 28 రోజుల పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అన్ని పోస్టులకు కలిపి 5,77,064 దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థుల్లో 74.66 శాతం మంది పురుషులు ఉండగా, 25.33 శాతం మంది మహిళలు



ఉన్నారు. దరఖాస్తుదారుల్లో అత్యధికంగా బీసీలు 49.19 శాతం మంది ఉన్నారు. తర్వాతి స్థానంలో ఎస్సీ, ఎస్టీలు 43.60 శాతం మంది ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకున్న 3.45 శాతంతో కలిపి ఓసీల సంఖ్య కేవలం 7.20 శాతంగా ఉంది.ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయకుండా పోలీస్ నియామకాల్లో మొదటిసారి ఆధార్ గుర్తింపు ప్రక్రియ అమలు చేశారు. దీనిలో భాగంగా దరఖాస్తు చేసుకునేటప్పుడే అభ్యర్థులు తమ ఫోన్ ద్వారా తమ మొహాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేసేలా ముందస్తుగానే చేశారు. ఇది ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చుతుంది. తద్వారా ఒకరికి బదులు మరొకరు దరఖాస్తు చేయడానికి ఏ మాత్రం వీలుండదు. దరఖాస్తుదారుల్లో మొత్తం 97.4 శాతం మంది విజయవంతంగా ఈ ఆధార్ గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన వారికి ఈ నెల 30 వరకు తమ లాగిన్ వివరాల ద్వారా ప్రక్రియను పూర్తి చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. తర్వాత వారి దరఖాస్తు ఫారాన్ని పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**56.84 శాతం మంది తెలుగులో**

అభ్యర్థులు మూడు భాషల్లో అంటే తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూలలో పరీక్ష రాయొచ్చు. అత్యధికంగా 56.84 శాతం మంది తెలుగులో రాయడానికి ఎంచుకోగా, 43.02 శాతం మంది ఇంగ్లీష్, 0.12 శాతం మంది ఉర్దూలో రాయడానికి మొగ్గుచూపారు. ఎస్సై, ఏఎస్సై తత్సమాన ఉద్యోగాలకు నవంబరు 29న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహిస్తారు. కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలకు డిసెంబరు 20న ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 15 నుంచి 18 కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నామని తెలంగాణ పోలీస్ నియామక బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు వివరించారు.

**ఖాళీలు ఇలా**

ఎస్సై (సివిల్) - 148 ఎస్సై (ఏఆర్)-14 ఎస్సై (టీజీఎస్పీ) - 12 ఎస్సై (ఎస్ఏఆర్‌సీపీఎల్) - 3 ఏఎస్సై (ఫింగర్ ప్రింట్ బ్యూరో) - 23 కానిస్టేబుల్ కానిస్టేబుల్ (సివిల్) - 3,697 కానిస్టేబుల్ (ఏఆర్) -1052 ఎస్ఏఆర్‌సీపీఎల్ - 24 పీటీవో డ్రైవర్ - 20 కానిస్టేబుల్ మెకానిక్ -7 స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) - 44 అగ్నిమాపకశాఖ (ఫైర్ ), విపత్తు నిర్వాహణ స్టేషన్ ఫైర్ ఆఫీసర్: 39 ఫైర్ ఫైటర్: 751 జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్(పురుషులు): 14 డిప్యూటీ జైలర్(మహిళలు): 1 వార్డర్(పురుషులు): 196 వార్డర్(మహిళలు): 12 ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్)లో ఎస్సై: 44 కానిస్టేబుల్: 1,380

# చెల్లెలి చావుకు ప్రతీకారం అన్నంత పనీ చేసిన సంతోష్

## హరిబాబును తానే చంపానన్న వైష్ణవి సోదరుడు

**యూట్యూబర్ వైష్ణవి హత్య కేసు నిందితుడు, ఆమె భర్త హరిబాబు దారుణ హత్య**


**నిజామాబాద్‌లో నడిరోడ్డుపై కత్తితో నరికి చంపిన దుండగులు**

**తానే హత్య చేశానంటూ సెల్ఫీ వీడియో విడుదల చేసిన వైష్ణవి సోదరుడు సంతోష్**

**చెల్లి హత్యకు న్యాయం జరగలేదనే ప్రతీకారంతోనే చంపినట్లు వెల్లడి**

**ఆరు నెలల వ్యవధిలో రెండు హత్యలతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం**

యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఆమె భర్త చిత్తరి హరిబాబు (26)ను తానే చంపానంటూ వైష్ణవి సోదరుడు సంతోష్ ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. నిజామాబాద్‌లో గురువారం పట్టపగలు నడిరోడ్డుపై దుండగులు హరిబాబును కిరాతకంగా నరికి చంపారు. ఈ హత్య జరిగిన కొన్ని గంటల్లోనే సంతోష్ ఈ వీడియోను విడుదల చేస్తూ పోలీసులకు లొంగిపోతున్నట్టు ప్రకటించాడు. వైష్ణవి హత్యకేసులో గత కొంతకాలంగా బెయిల్‌పై బయట ఉన్న హరిబాబు, తన తల్లితో కలిసి నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మొక్కజొన్న కంకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం, దాహం వేయడంతో పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేశారు. ఒక వ్యక్తి కారులో నుంచి దిగి, పదునైన ఆయుధంతో హరిబాబు తలపై విచక్షణారహితంగా నరికాడు. కేవలం 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. తీవ్ర రక్తస్రావంతో



హరిబాబు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

**చెల్లి హత్యకు ప్రతీకారంగానే..**

ఈ ఏడాది మార్చి 16న జగిత్యాల జిల్లా కోరుట్లలో తన భార్య, నాలుగు నెలల గర్భిణి అయిన వైష్ణవి (19)ని హరిబాబు గొంతు నులిమి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో అరెస్టయిన హరిబాబు, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే, తన చెల్లి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయిందని, అందుకే తానే హరిబాబును హత్య చేశానని వైష్ణవి సోదరుడు సంతోష్ వీడియోలో తెలిపాడు. "నా చెల్లిలి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయింది. హరిబాబును నేనే చంపా. పోలీసులకు లొంగిపోతున్నా. నాకు శిక్ష పడకుండా ప్రజలు మద్దతు ఇవ్వాలి" అని సంతోష్ ఆ వీడియోలో కోరాడు.

**ప్రేమ, పెళ్లి నుంచి హత్యల వరకు..**

కోరుట్లకు చెందిన హరిబాబు, మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి ప్రభుత్వాసుపత్రిలో స్వీపర్లుగా పనిచేస్తూ ప్రేమించుకున్నారు. 14 నెలల క్రితం పెళ్లి చేసుకుని, వైష్ణవి పుట్టింట్లోనే కాపురం పెట్టారు. ఆమె యూట్యూబ్ రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అయితే, కొద్దికాలానికే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో, గర్భిణి అని కూడా చూడకుండా వైష్ణవిని హరిబాబు హత్య చేశాడు. వైష్ణవి తన కుటుంబంలో ఏకైక ఆడపిల్ల కావడంతో పాటు, ఆమెకు సొంత, సమీప బంధువుల కుమారులు కలిపి మొత్తం 13 మంది సోదరులు ఉన్నారు. వారందరికీ ఆమె అంటే ప్రాణం. ఆమె హత్యను జీర్ణించుకోలేకపోయిన సోదరులు, హరిబాబును కఠినంగా శిక్షించాలని, లేదంటే తామే చంపేస్తామని అప్పట్లో ప్రతినబూనారు. అన్నంత పనీ ఇప్పుడు చేయడం కోరుట్లలో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఈ రెండు హత్యలు ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి.

# విజయవంతమైన 'వన్‌వే' విధానం.. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు!

**1'వన్ వే' తో చిక్కుల్లేకుండా సాగుతున్న ట్రాఫిక్**

**ఈ విధానం విజయవంతం కావడంతో మారిన ప్రభుత్వ ఆలోచన**

**పంజాగుట్ట నుంచి చెక్‌పోస్ట్ వరకు 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన**

**కొత్త ప్లాన్‌తో ప్రభుత్వానికి రూ.1000 కోట్లకు పైగా ఆదా**

**భూసేకరణ, నిర్మాణ వ్యయం తగ్గించడమే లక్ష్యం**



కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళిక మారింది. ఇటీవల ప్రవేశపెట్టిన 'వన్‌వే' విధానం ట్రాఫిక్ సమస్యను చాలావరకు పరిష్కరించడంతో, రూ.1090 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులను రద్దు చేయాలని అధికారులు భావిస్తున్నారు. వాటి స్థానంలో పంజాగుట్ట నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు.గతంలో కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ఏడు జంక్షన్ల వద్ద సిగ్నళ్ల కారణంగా వాహనదారులు నిమిషాల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అయితే, నిర్మాణ పనుల కోసం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వన్‌వే విధానం ఊహించని ఫలితాలనిచ్చింది. ప్రస్తుతం వాహనాలు ఎక్కడా ఆగకుండా సాఫీగా ప్రయాణిస్తున్నాయి. దీంతో, వేల కోట్లు ఖర్చు చేసి బహుళ ప్రాజెక్టులు చేపట్టడం అనవసరమని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు.కొత్త ప్రణాళిక ప్రకారం, పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవునా ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీనివల్ల ఐటీ కారిడార్ నుంచి పంజాగుట్ట, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనదారులు సిగ్నల్ చిక్కులు లేకుండా నేరుగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త ప్రతిపాదనతో ప్రభుత్వానికి భూసేకరణ, నిర్మాణ వ్యయం రూపంలో రూ.1000 కోట్లకు పైగా ఆదా కానుంది. పాత ప్లాన్ ప్రకారం 237 ఆస్తులను సేకరించాల్సి ఉండగా, కొత్త కారిడార్‌తో ఆ భారం గణనీయంగా తగ్గనుంది.ప్రస్తుతం విజయవంతంగా నడుస్తున్న కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం యథాతథంగా కొనసాగుతుంది. ఇప్పటికే పనులు మొదలుపెట్టిన చోట్ల వాటిని నిలిపివేసి, రోడ్లను పునరుద్ధరించనున్నారు. ఈ నూతన ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి తుది ఆమోదం లభించాల్సి ఉంది.

# తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల తేదీలు ఇవే!

**తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల**

**నవంబర్ 29న ఎస్ఐ, డిసెంబర్ 20న కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష**

**మొత్తం 7,437 పోస్టులకు 5.77 లక్షలకు పైగా దరఖాస్తులు**

**ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌కు సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగింపు**

**పాత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై దృష్టి పెట్టాలని అభ్యర్థులకు సూచన**



తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు కీలకమైన ప్రకటన వెలువడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రాథమిక రాత పరీక్ష (ప్రిలిమినరీ) తేదీలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి ఖరారు చేసింది. ఈ వివరాలను టీఎస్ఎల్ పీఆర్బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.షెడ్యూల్ ప్రకారం, ఎస్ఐ పోస్టులకు 2026 నవంబర్ 2న, కానిస్టేబుల్ పోస్టులకు 2026 డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ , అగ్నిమాపక, జైళ్ల శాఖల పరిధిలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

**పోస్టులకు భారీ స్పందన**

ఈ ఉద్యోగాలకు రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు కేవలం 28 రోజుల వ్యవధిలో మొత్తం 5,77,064 దరఖాస్తులు అందినట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక్కో అభ్యర్థి 1.34 పోస్టులకు దరఖాస్తు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో 74.66 శాతం పురుషులు, 25.33 శాతం మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ అభ్యర్థులు 49.19 శాతం, ఎస్సీ/ఎస్టీలు 43.60 శాతం, ఓసీలు 7.20 శాతం చొప్పున ఉన్నారు.

**పరీక్షల నిర్వహణ, ఇతర వివరాలు**

పరీక్షల నిర్వహణకు బోర్డు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షను పాత 10 జిల్లాల కేంద్రాల్లో, కానిస్టేబుల్ పరీక్షను 15 నుంచి 18 ప్రాంతాల్లో నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను 97.4 శాతం మంది పూర్తి చేశారని, సాంకేతిక కారణాల వల్ల పూర్తి చేయలేకపోయిన మిగిలిన వారికి సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించినట్లు ఛైర్మన్ తెలిపారు. అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సూచించారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్‌ను తనిఖీ చేయాలని బోర్డు కోరింది.

# ఏఐ డీప్‌ఫేక్‌తో మోసాలు.. దేవినేని ఉమలా వీడియో కాల్స్

**ఏఐ టెక్నాలజీతో రాజకీయ నాయకుల వీడియో కాల్స్ సృష్టిస్తున్న భార్గవ్**

**దేవినేని ఉమలా మాట్లాడి మోసాలకు పాల్పడుతున్న వైనం**

**తాజాగా విశాఖలో మాజీ సైనికుడి నుంచి రూ.80 వేల వసూలు**

**గతంలోనూ ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల్లో పలువురిని మోసం చేసిన నిందితుడు**

**స్థానిక ఎన్నికల వేళ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక**




రాజకీయ నాయకుల ఫొటోలతో ఏఐ డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించి, వారు మాట్లాడుతున్నట్లుగా వీడియో కాల్స్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న కేటుగాడు మళ్లీ తెరపైకి వచ్చాడు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన భార్గవ్ అనే బీటెక్ గ్రాడ్యుయేట్, ఏడాది విరామం తర్వాత మరోసారి మోసాలకు తెరలేపాడు. తాజాగా విశాఖపట్నంలో మాజీ మంత్రి దేవినేని ఉమ ఫొటోను డీపీగా పెట్టుకుని, ఆయనలానే మాట్లాడుతూ ఓ మాజీ సైనికుడికి వీడియో కాల్ చేసి రూ.80 వేలు కాజేశాడు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.గతేడాది కూడా భార్గవ్ ఇదే తరహా మోసాలకు పాల్పడ్డాడు. జడ్పీటీసీ సీటు ఇప్పిస్తానంటూ దేవినేని ఉమలా మాట్లాడి ఎన్టీఆర్ జిల్లాలో ఓ వ్యక్తిని మోసం చేసేందుకు ప్రయత్నించాడు. అంతకుముందు ఖమ్మం, విజయవాడ నగరాల్లోని టీడీపీ నేతలకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంపై ఉన్న పట్టుతో పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తపడుతున్నాడు.నేరం చేసిన తర్వాత కొంతకాలం పాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం, పోలీసులు తనను మరిచిపోయారనుకున్నాక మళ్లీ మోసాలకు పాల్పడటం భార్గవ్ పద్ధతి. డబ్బుల లావాదేవీల కోసం ఇతరుల బ్యాంకు ఖాతాలను వాడుతూ పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, టికెట్ ఆశించే అభ్యర్థులు ఇలాంటి మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా నాయకులు వీడియో కాల్ చేసి డబ్బు అడిగితే, ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని సూచిస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com